క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎస్పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ హైదర్‌గూడా విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సీబీఐ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ సీబీఐ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గుజరాతీ గల్లీ, సీబీఐ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం



జియాగూడ: ఈ నెల 10న జియాగూడ రంగనాథ దేవస్థానంలో జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు హాజరుకావాలని గురువారం ఆలయ చైర్మన్ ఎస్‌టీ.చారి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిను కలిసి ఆహ్వానించారు.

'రాజకీయ ఉనికి కోసమే కవిత బీసీ రాగం'

గౌలిపురా: ఎమ్మెల్సీ కవిత కేవలం తన రాజకీయ ఉనికి, స్వార్థ ప్రయోజనాల కోసమే బీసీ రాగం అందుకొని రాజకీయ డ్రామాకు తెర లేపారని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. గురువారం లాల్‌దర్వాజాలోని కార్యాలయంలో వెంకటేశ్ మాట్లాడుతూ..కవితకు బీసీ సమస్యలు, చరిత్ర, ఉద్యమాల గురించి అసలే తెలియదన్నారు. అలాంటిది బీసీ సమస్యల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించారని.. దీంతో అనేక మంది బీసీలు పోటీ చేసే అవకాశం కోల్పోయారన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ టేబుల్ కేలండర్ ఆవిష్కరణ



టేబుల్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నిఖిల్ చక్రవర్తి, డాక్టర్ జి.సుదర్శన్ గౌడ్ తదితరులు

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా టేబుల్ కేలండర్‌ను రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.సుదర్శన్ గౌడ్, ఇతర ప్రతినిధులు ఆనంద్, డీకె.నరేందర్ రెడ్డి, మహేష్ కుమార్, పాల్వాయ్ ప్రభాకర్, శివకుమార్, నాగ చంద్రారెడ్డి, శివ సాగర్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



గౌలిపురా: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను లాల్‌దర్వాజా ప్రాంతానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు పంకజ్ షిండే నూతన సంవత్సరం సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కేటీఆర్‌ను పంకజ్ షిండే సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తున్న 22 మంది అరెస్ట్

జియాగూడ: మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించి సుమారు 22 మందిని అదుపులోకి తీసుకున్నామని మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం వివరాలను వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో చైనా మాంజా, గాలిపటాలు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. నిషేధించినప్పటికీ వ్యాపారులు విక్రయించడం వల్ల మనుషులకు, పక్షులకు, జంతువులకు ఎంతో హాని జరుగుతుందన్నారు. అక్రమంగా నిషేధిత మాంజా విక్రయిస్తున్న వారిపై 18 కేసులను పెట్టి 1094 సింథెటిక్ బాబీన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జియాగూడ: ఆరోగ్యం సరిగా లేక మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సాయంత్రం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపిన వివరాల ప్రకారం..బాంజావాడిలో ఉంటున్న కె.రాకేష్ (45) కూలి. కొన్ని రోజుల నుంచి ఆరోగ్యం సరిగా లేక పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. ఇతనికి భార్య రజిత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భార్య గండిపేటలో పని చేస్తుంది. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో రాకేష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి కొన ఊపిరితో ఉన్న రాకేష్‌ను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

400 ఏళ్ల చరిత్రకు నిలువుటద్దం.. రంగనాథ ఆలయం

- జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో కొనసాగుతున్న ధనుర్మాస పూజలు
- 10న నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు
- అన్ని ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు



ఆలయ శిఖరం



శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి



గోదాదేవి అమ్మవారు



ఉత్సవ మూర్తులు

అబిడ్స్/జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ఆలయం 400 ఏళ్ల క్రితమే నిర్మించబడింది. ఈ ఆలయం కర్ణాటకలోని శ్రీరంగం పోలిన ఆకారంలో రంగనాథస్వామి వారు కొలువుదీరి ఉండడం విశేషం. కోరిన కోరికలు తీర్చే రంగనాథ స్వామిగా ఖ్యాతిగాంచిన ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఐదు రోజుల పాటు జరుగనున్నాయి. నగరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రతి సంవత్సరం ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకోవడం జరుగుతుంది. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఈ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేయడానికి పనులు ప్రారంభించారు.

నాటి జైనుల ఇలవేల్పుగా..

గోల్కొండ రాజుల పరిపాలన కాలంలో కోటలో వజ్రాలు, వైడూర్యాలు సానపట్టేవారు. అనంతరం కార్వాన్‌లో రాశులు పోసి అమ్మేవారు. ఈ వ్యాపారం ఎక్కువ శాతం జైన మతస్థులు నిర్వహించేవారు. వీరంతా ప్రతి యేటా శ్రీరంగంలోని రంగనాథస్వామిని దర్శించుకునేవారు. భక్తులు, అక్కడకు వెళ్లలేని వృద్ధులు చేరువలోనే ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించి మూసీనది పక్కన జియాగూడ ప్రాంతాన్ని ఎంచుకొని ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం పూర్తిస్థాయిలో వాస్తు ఆలయంగా నిర్మించబడింది. నాటి నుంచి భక్తుల కొంగు బంగారంగా మారడంతో భక్తుల తాకిడి ప్రతి యేటా పెరుగుతూ వస్తుంది. ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి, గోదాదేవి నమ్మాళ్వార్, నవగ్రహ, ఆంజనేయ, పుష్కరిణి తదితర ఆలయాలు నెలకొన్నాయి.

వానమామలై వైష్ణవ జీయర్‌స్వామి ఆలయంగా ఖ్యాతి..

వానమామలై వైష్ణవ జీయర్‌స్వామి ఆలయంగా ఖ్యాతి గడించింది. 35 ఏళ్ల నుంచి రంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. పురానాపూల్ నుంచి ఆలయం వరకు సప్తద్వారాలు, విద్యుత్ అలంకరణలతో వీరాజిల్లుతుంది. అలాగే ఆలయంలో వివిధ దేశాల నుంచి తెప్పించిన పుష్పాలు అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

170 ఏళ్లుగా శృంగారం వారి వారసత్వంలో..

రంగనాథస్వామి ఆలయంలో 170 ఏళ్ల నుంచి శృంగారం వంశస్థులు పూజాది కార్యక్రమాలు, ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటికే ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కాగా అందులో భాగంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవం, పరమ పదోత్సవం, స్వామివారి కల్యాణం, కరినోము ఉత్సవాలతో వేడుకలు ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఎస్‌టీ చారి, ప్రతినిధి శేషాచార్యులు, అర్చకులు రంగనాథచార్యులు, బద్రీనాథ్‌లు తెలిపారు.

గో రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



ఫౌండేషన్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సుల్తాన్‌బజార్: గో రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేసేలా చొరవ చూపాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, జస్రా శ్రీమాల్, రిదేష్ జాగిర్దార్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. ఈ మేరకు గురువారం రాజ్‌భవన్‌లో లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ కేలండర్‌ను గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలన్నారు. లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ గో సంరక్షణ కోసం పాటుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



పూజలు చేస్తున్న వెంకటేష్

చార్మినార్: ఈ ఏడాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో తలపెట్టిన ప్రతి పని దిగ్విజయంగా పూర్తి కావాలని, ప్రజలు అనుకున్న లక్ష్యాల వైపు చేరుకోవాలన్నారు.


సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ తదితరులు


చాంద్రాయణగుట్ట: సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ వర్మ అన్నారు. ఉప్పుగూడ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వాటి పట్ల అవగాహన పొంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై త్రిమూర్తులు, సంఘం ప్రతినిధులు కన్నోజు లక్ష్మీకాంతం, వింజమూరి వెంకటాచారి, దాసోజు కనకాచారి, తోటి శ్రీనివాస్, మధుసూదన్, శివకుమార్, లక్ష్మీనారాయణ, లక్కుంట్ల శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఆహ్వానం



చార్మినార్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివ యాదవ్ బీఆర్‌ఎస్ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈనెల 12న జరిగే కరణ్ బాగ్ మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవానికి రావాల్సిందిగా కేటీఆర్‌ను ఆహ్వానించానని ఆయన తెలిపారు. పవన్, ఆశ్రఫ్ సాయి, మంజుల తదితరులున్నారు.

సీఎంను కలిసిన వాటర్‌బోర్డు యూనియన్ నేతలు



అఫ్జల్‌గంజ్: సీఎం రేవంత్‌రెడ్డిని వాటర్‌బోర్డు ఎస్సీ, ఎస్టీ అధ్యక్షుడు జి.లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ..వాటర్‌బోర్డులో ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాల ఉద్యోగులు, కార్మికుల సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మజ్లిస్ నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం కార్వాన్, నానల్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి పలువురు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తమతమ ప్రాంతాలలోని సమస్యలను ఆయనకు వివరించారు. టోలిచౌకీ, ఎండిలైన్స్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పైప్‌లైన్ పనుల వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో రూ.292 కోట్లతో వరద నీటిని మళ్లించడానికి భారీ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. సాంకేతికంగా ఈ పనులు అత్యంత క్లిష్టమైనవన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, అబీబ్‌చౌస్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

మల్లేపల్లి ప్రిన్స్ హోటల్‌లో ఫుడ్ శాంపిల్స్ సేకరణ

నాంపల్లి: మల్లేపల్లి చౌరస్తాలోని ప్రిన్స్ హోటల్‌లో కుళ్లిపోయిన చికెన్ బిర్యానీకి వాడుతున్నారనే అభియోగంపై జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుడ్ శాంపిల్స్‌ను సేకరించారు. అధికారులు సేకరించిన శాంపిల్స్‌ను పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు. ఈ నివేదిక ఆధారంగానే తగు చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సమీనా బేగం పేర్కొన్నారు. కుళ్లిపోయిన చికెన్, కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వివరించారు. నిజమని తేలితే కేసులు నమోదు చేసి హోటల్‌ను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

శోభన దేశ్ పాండేకు సావిత్రి బాయి జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు



చార్మినార్: ప్రముఖ విద్యావేత్త డాక్టర్ శోభన దేశ్ పాండేను సావిత్రి బాయి జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ విద్యావేత్త, సరోజిని నాయుడు వనిత మహా విద్యాలయ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆమెకు ఈ ఏడాది సావిత్రి బాయి జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు-2025 అందజేయనున్నామన్నారు. ఈనెల 3 న కళాశాలలో ఈ అవార్డును ప్రదానం చేస్తామని తెలిపారు.

లూయిస్ బ్రెయిలీ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు

యాకుత్‌పురా: లూయిస్ బ్రెయిలీ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దారుషిఫా ప్రభుత్వ అంధుల పాఠశాలలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గురువారం ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..ఈ నెల 4న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ.వి నరసింహారెడ్డి, ప్రత్యేక అతిథులుగా రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజా, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, గౌరవ అతిథులుగా బహదూర్‌పురా డిప్యూటీ ఈఓ పోమ్య నాయక్, జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్ డీసీ. సరితతో పాటు పలువురు అధికారులు హాజరుకానున్నారన్నారు. వసతి గృహం, పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయనున్న లూయిస్ బ్రెయిలీ విగ్రహాన్ని ముఖ్యఅతిథిగా హాజరుకానున్న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి ఆవిష్కరిస్తారని ఆయన తెలిపారు. అంధ విద్యార్థులచే సంగీత విభావరీ, సంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తారన్నారు.

గౌరీ శంకర్ రావుకు అదనపు బాధ్యతలు



సంతోష్‌నగర్: మిధాని సీఎఫ్‌ఓ, ఫైనాన్స్ డైరెక్టర్‌గా పని చేస్తున్న గౌరీ శంకర్ రావు నరంశెట్టి మిధాని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ పదవీ కాలం మూడు నెలల కాలానికి లేదా సాధారణ బాధ్యతలు స్వీకరించే వరకు ఉంటుందన్నారు. ఎన్.గౌరీ శంకర్ రావు వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్, 2020లో మిధాని ఫైనాన్స్ డైరెక్టర్‌గా చేరారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్, ప్రతినిధులు

చార్మినార్: ముదిరాజ్ సహకార సంఘం, ఉప్పుగూడ ఆధ్వర్యంలో గురువారం ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో నూతన సంవత్సర 2025 కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేందర్ వర్మ ప్రసాద్‌తో పాటు సబ్ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజం కోసం పాతబస్తీ యువకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం చైర్మన్ రుద్రారం అంజయ్య, అధ్యక్షుడు బార్ల శ్రీనివాస్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి బి దేవేందర్, శ్రీ.వేణుగోపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాశమోనీ శ్యామరావు ముదిరాజ్, ఆకుల శ్రీనివాస, శ్రీమన్నారాయణ, నరహరి, మోర సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్కారం



కుటుంబ పెద్దలను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కుటుంబ పెద్దలు కుటుంబానికి దిక్సూచి లాంటి వారని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. గురువారం రిసాల బజార్‌లోని శివాలయ ప్రాంగణంలో కుటుంబ పెద్దలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ పెద్దలచే కేక్‌కట్ చేయించి కుటుంబ సభ్యులందరూ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బి.సురేష్‌చారి, బి.శ్రీకాంత్‌చారి, శ్రీను, వినోద్‌సింగ్, కిట్టు, వాణిశ్రీ ఉన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం



కేంద్ర మంత్రికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆత్రేయాచార్యులు

చార్మినార్: రాబోయే వైకుంఠ ఏకాదశి వేడుకలకు హాజరుకావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బాలాజీ ఆలయ అర్చకుడు, అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయచార్యులు కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10 నుంచి 14 తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరగనున్నందున.. ఉత్సవాల్లో పాల్గొనాలని కోరామన్నారు.

సంతాన సాఫల్య కేంద్రానికి విశేష స్పందన



డాక్టర్ రజిని రెడ్డి

దూద్‌బౌలి: పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గత నవంబర్‌లో ప్రారంభించిన సంతాన సాఫల్య కేంద్రం (ఐవీఎఫ్) ద్వారా వైద్య సేవలు పొందేందుకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీరెడ్డి తెలిపారు. నవంబర్‌లో ఐవీఎఫ్ సెంటర్‌కు 143 మహిళలు రాగా..అందులో 36 మందికి స్కానింగ్ నిర్వహించామన్నారు. అలాగే డిసెంబర్‌లో 310 మంది మహిళలు రాగా.. అందులో 170 మందికి స్కానింగ్ నిర్వహించామన్నారు. ప్రస్తుతం ముగ్గురు మహిళలకు ఈ ప్రక్రియ ద్వారా సంతానం కలిగే విధంగా వైద్య సేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు సంతానం లేని మహిళలకు ప్రైవేట్ ఆసుపత్రిలోనే ఈ వైద్య సేవలు అందేవని..ఇప్పుడు కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం ఐవీఎఫ్ సెంటర్లు ప్రభుత్వాసుపత్రిలోనే ప్రారంభించడంతో పెద్ద ఎత్తున మహిళలు సంతానం కోసం ప్రభుత్వాసుపత్రిని ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్‌లో ముందుగా ఆసుపత్రికి వచ్చిన భార్యాభర్తలకు ఇద్దరికీ వివిధ పరీక్షలు నిర్వహించి హార్మోన్స్ సరిగా లేని వారికి పాలిక్యులర్ స్టడీస్, స్కానింగ్ నిర్వహిస్తామని, అండాశయ కణాల పెరుగుదల కోసం మందులు అందిస్తున్నామన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం



ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను సన్మానిస్తున్న సతీష్‌కుమార్, సుభాష్ తదితరులు

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మార్కెటింగ్ నగర మాజీ డైరెక్టర్ సతీష్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు సుభాష్ ఆయనను ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కుల మతాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి, ప్రగతి కొనసాగుతుందన్నారు.

ఫుట్‌పాత్‌పై వాణిజ్య సముదాయం!



నాంపల్లి: జీహెచ్‌ఎంసీ సర్కిల్-12 టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యానికి ఈ చిత్రం నిలువెత్తు నిదర్శనం. బల్దియా అధికారులు ఏమి చేస్తారులే అనే ధీమాతో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. నాంపల్లిలో కబ్జాదారులు చివరకు ఫుట్‌పాత్‌లను కూడా వదలడం లేదు. మల్లేపల్లి బజార్‌ఘాట్ కరోడ్‌మాల్ బిల్డింగ్ సమీపంలోని సహారా డెయిరీకి ఎదురుగా ఓ వ్యక్తి ఫుట్‌పాత్ మీదనే వాణిజ్య సముదాయ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ విషయమై సర్కిల్-12 టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తిని వివరణ కోరగా సమాచారం అందగానే నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసినట్లు తెలిపారు.

నేటి నుంచి 'నో యువర్ ఆర్మీ మేళా'



గోల్కొండ కోటలో మేళా ఏర్పాట్లలో ఆర్మీ అధికారులు

గోల్కొండ: నేటి నుంచి ఈ నెల 5వ తేదీ వరకు గోల్కొండ కోటలో ఆర్మీ గురించి తెలుసుకోండి అనే కార్యక్రమాన్ని 'నో యువర్ ఆర్మీ మేళా'ను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం గోల్కొండ కోట మెయిన్ గేటు ఆవరణలో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని మిలటరీ రక్షణ శాఖ పౌర సంబంధాల శాఖ అధికారి తెలిపారు. ఈ మేళాలో ఆర్మీ వారు ఉపయోగించే ఆయుధాలు, వివిధ రకాల తుపాకులను ప్రదర్శిస్తారు. అంతేకాకుండా యుద్ధంలో శత్రువుల కంటపడకుండా సైనికులు ఏ రకమైన పద్ధతులు అవలంభిస్తారు అనే వాటిపై కూడా చిత్రప్రదర్శన తదితర విషయాలపై సమగ్రంగా తెలియజేసేందుకు వివిధ రకాలైన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇండియన్ ఆర్మీలో చేరే వారికి ఈ మేళా ఎంతగానో ఉపయోగపడుతుందని ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుంది.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నూతన పైప్‌లైన్ పనులను చేపడుతున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. డివిజన్‌లోని ఎస్‌ఆర్టీ కాలనీ, మదీనానగర్, అజ్మత్‌నగర్, ముర్తుజానగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. బస్తీల్లో కొనసాగుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులు పరిశీలించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డ్రైనేజీ మురుగు నీటి సమస్యలను అరికట్టేందుకు పూడికతీత, నూతన పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. ఈ పర్యటనలో జీహెచ్‌ఎంసీ ఏఈ అన్సరీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫ్యాన్సీ క్యాప్‌లు



గోల్కొండ: గోల్కొండ కోట వద్ద లభించే ఫ్యాన్సీ క్యాప్‌లు, యాంటిక్ వస్తువులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా క్యాప్‌లు అమ్ముతున్న ఈ క్యాప్ మార్ట్‌లో ప్రిన్సెస్ దయానా, విక్టోరియా క్యాప్, దీపికా పదుకొనే క్యాప్‌తో పాటు మహిళలు, చిన్నారులు అమితంగా ఇష్టపడే ఫ్యాన్సీ క్యాప్‌లు ఇక్కడ లభిస్తాయి. వీటికి తోడుగా తమిళ సోదరులు ఎంతగానో ఇష్టపడే డైరెక్టర్ క్యాప్ ఇక్కడ లభిస్తుంది. హోల్‌సెల్ ధరల కంటే తాము తక్కువ ధరలకే అమ్ముతామని స్టాల్ నిర్వాహకుడు మహ్మద్ అహ్మద్ తెలిపారు.